

సూర్య
www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

ఆదివారం,14 సెప్టెంబర్ 2025

8 పేజీలు


### అవినీతి లేని విలువలతో కూడిన

# రాజకీయాలు చేస్తా

- నన్ను కెలకాలని ప్రయత్నిస్తే అపరిచితుడు బయటికి వస్తాడు
- నేను చేస్తున్న అభివృద్ధిని హైజాక్ చేస్తే సహించను
- కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ కీలక వ్యాఖ్యలు



భీమవరం,మేజర్న్యూస్ : తాను నిజాయితీగా, అవినీతికి తావులేకుండా విలువలతో కూడిన రాజకీయాలు చేస్తానని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. భీమవరంలో జిల్లా బిజెపి కార్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కీలకవ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ఎవరో చేసిన అభివృద్ధిని తానే చేశానని చెప్పుకునే వ్యక్తిత్వం తనది కాదని,అదే సమయంలో తాను చేసిన అభివృద్ధి గురించి గట్టిగాచెప్పడానికి తానువెనుకాడబోనని అన్నారు.తాను ఆర్థికంగా సామాన్యుడినే అయినప్పటికీ, నిబద్ధత, ఆత్మవిశ్వాసం, ప్రజలకు అందుబాటులో ఉండటంలో తాను చాలా గట్టివాడినని ఆయన చెప్పారు.

**- సామాన్యుడిగానే పని చేస్తాను -**తనను కొందరు 'సామాన్యుడు' అని అంటున్నారని,తానురాజకీయాల్లో ఒక్క రూపాయి కూడా సంపాదించాలనే ఆలోచన లేకుండా సామాన్యుడిగానే పని చేస్తున్నానని మంత్రి తెలిపారు. "నేను గానీ,నాచుట్టూ ఉన్న వ్యక్తులు గానీ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు, అవినీతికి పాల్పడినట్లు మీదృష్టికివస్తే, దయచేసి పత్రికా ముఖంగా నాకు తెలియజేయండి. నేను చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తే, తగిన సమాధానం చెప్పడానికి వెనకాడను" అని ఆయన హెచ్చరించారు.

**- నిబద్ధతతోనే రాజకీయాల్లోకి -** తాను వారసత్వంగా రాజకీయాల్లోకి రాలేదని,డబ్బు సంపాదించడానికి గానీ,వ్యాపారసామ్రాజ్యాన్ని కాపాడుకోవడానికి గానీ రాజకీయాల్లోకి రాలేదని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అన్నారు."బీజేపీకి దేశంలో కేవలంరెండుపార్లమెంట్స్థానాలు ఉన్నప్పుడు, ఆ పార్టీ సిద్ధాంతాలు, దేశభక్తితో రాజకీయాల్లోకి వచ్చాను అన్నారు.తన మంచితనాన్ని చేతగానితనంగా చూస్తే సహించను అని పేర్కొన్నారు. విద్యార్థి రాజకీయాల నుంచేడబ్బు,అధికారం ఉన్నవారికి భయపడకుండా వివిధ సమస్యల పరిష్కారానికి పోరాడాను అన్నారు. అహంకారపూరిత రాజకీయాలకు తన వద్ద స్థానం లేదు అని ఆయన స్పష్టం చేశారు.

**- అభివృద్ధే నా బ్రాండ్ -**తాను ఒక సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి, గత ఎన్నికలలో నర్సాపురం పార్లమెంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండు లక్షలకు పైగా భారీ మెజారిటీతో గెలిచి కేంద్ర మంత్రి అయ్యానని,ప్రజలుతనపైఉంచిననమ్మకాన్ని నిలబెట్టుకుంటానని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. తన అభివృద్ధి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని

- తరువాయి 2లో..



## రూ.24.49.511 లక్షలు

# సిఎం సహాయ నిధి

- చెక్కులు అందజేసిన మంత్రి కొలుసు పార్థసారథి

**నూజివీడు,మేజర్న్యూస్:** పేదల మెరుగైన వైద్యం కోసరం ప్రభుత్వం వేలాది కోట్లు కేటాయించింద ని,రాష్ట్రంలో 5కోట్ల ప్రజలకు ఎన్.టి.ఆర్ వైద్యసేవ ద్వారా ఆరోగ్య సేవలు అందిస్తున్న కూటమి ప్రభుత్వం అని మంత్రి తెలిపారు.అపత్కాలంలో ఉన్న నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి,అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో చాట్రాయి మండలంలో శనివారం 17మంది కుటుంబాలకు గాను సుమారు రూ,6.99.041లక్షలు, ఆగిరిపల్లి మండలంలో 6గురి కుటుంబాలకు రూ,1.95.152లక్షల, ముసునూరు మండలంలో 7గురి కుటుంబాలకు రూ,3.15.132లక్షల, నూజివీడు మండలంలో 6గురి కుటుంబాలకు గాను,రూ,3.97.473లక్షల నూజివీడు పట్టణానికి చెందిన 8మందికుటుంబాలకు గాను రూ.5.28.678 లక్షల ఇతర ప్రాంతాలకు చెందిన 8మంది రూ.3.14035లక్షల మొత్తం 52మంది కుటుంబాలకుగాను సుమారు రూ.24.49.511 లక్షల చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేసిన మంత్రి. బాధిత కుటుంభాలు తాము ఒక ప్రవేట్ హాస్పటల్లో

- తరువాయి 2లో..

### చిన్న వెంకన్న సేవలో తూ.గో.జిల్లా

## నూతన కలెక్టర్ కీర్తి



**ద్వారకాతిరుమల, మేజర్న్యూస్:** ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయానికి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ సిహెచ్ కీర్తి శనివారం ఉదయం విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుగా ఆమె బంగారు వాకిటిన ప్రవేశించిస్వామివారిని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.అనంతరం ఆలయ ముఖ మండపంలో వేద పండితులు వేదఆశీర్వచనాలు పలికి స్వామివారి ప్రసాదాలనుఅందించారు.ఫోటోకాల్ సూపర్డెంటెంట్ గోవాడ సుబ్రహ్మణ్యంశ్రీవారిజ్ఞాపికను అందించారు.

### తెలంగాణా నుండి

# పెదవాగుకు వరద ఉధృతి

- పెదవాగు దిగువ ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- గోదావరి నది పరివాహక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం



**ఏలూరు/వేలేరుపాడు,మేజర్న్యూస్ :** తెలంగాణా నుండి పెదవాగుకు వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున పెదవాగు అనుకుని ఉన్న,దిగువ ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.పెదవాగు వరద ఉధృతిపై శనివారం సాయంత్రం అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్ట్ నీటిమట్టం 77.43 అడుగులకు చేరుకుందన్నారు. గతంలో పెదవాగుకు వచ్చిన వరద కారణంగా వేలేరుపాడు మండలంలో పెద్దఎత్తున నష్టం జరిగిందని, అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధికారులం దరూ అప్రమత్తతో ఉండి,ఎటువంటి ఆస్థి, ప్రాణ నష్టాలు జరగకుండా అధికారులుచర్యలు తీసుకోవాలన్నారు. పెదవాగుకు వరద ఉధృతిపై ప్రజలను అప్రమత్తం చేయాలని, నదికి అనుకుని ఉన్న ప్రజలు తమ నివాసాలను ఖాళీచేయించి,సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

- తరువాయి 2లో..

### ఏజెన్సీలో పొంగి

## ప్రవహించిన కాలువలు

- బుట్టాయిగూడెం - జీలుగుమిల్లి మధ్య రాకపోకలు బంద్



**బుట్టాయిగూడెం,మేజర్న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షంకురవడంతోకాలువలు ఉధృతంగా ప్రవహించాయి. మండలంలోని రెడ్డి గణపవరం గ్రామ సమీపంలో ఉన్న జల్లేరుకాలువ పొంగిప్రవహించింది.వాయవ్య బంగాళా ఖాతంలోఅల్పపీడనంఏర్పడటంతోశనివారం మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దింతో జల్లేరుకాలువ పొంగిపొర్లింది. దీంతో బట్టాయిగూడెం నుండి రెడ్డి గణపవరం జీలుగుమిల్లి కుక్కునూరు,వేలేరుపాడు,ఇతర గ్రామాలు వెళ్లేందుకు రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి.ముప్పిన వారి గూడెం గ్రామంలో ప్రధాన రహదారి మీదుగా వర్షపు నీరు ప్రవహించింది. కన్నాపురం వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న అల్లి కాలువ పొంగిపొర్లింది.

# వాసవిలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు






**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** ప్రతి విద్యార్థికి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని వాసవి డిగ్రీ కళాశాల చైర్మన్ ఎన్.వి.రమణ రావు అన్నారు.

కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు అందు బాటులో ఉండే విధంగా ఫీజులు నిర్ణయించి సేవాభావంతో కళాశాల నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యాబోధనతోపాటు సాంస్కృతిక కార్యక్ర మాలు,ఆటలు తదితర అంశాలలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ మద్దాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రతివిద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఉత్తమ విద్యను అందించడం ద్వారా మంచి భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మండ బ్రహ్మాజీ, కోశాధికారి నున్న సుందరం, ఉపాధ్యక్షులు పెనుగొండ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ పలివెల ఏకాంబేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బార్ల కేటాయింపుకు దరఖాస్తుకు గడువు పొడిగింపు

**భీమవరం,మేజర్ న్యూస్:** జిల్లాలో ముందుగా నోటిఫికేషన్ జారీ చేసిన బార్లు కేటాయింపునకు సంబంధించి దరఖాస్తు గడువును ఈ నెల 17 సాయంత్రం 6 వరకు పొడిగించడం జరిగిందని జిల్లా ఎక్సైజ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ ఉదయం 8 గంటలకు లాటరీ ద్వారా బార్లు కేటాయించడం జరుగుతుందని ఆయన వివరించారు.

# పెదవాగు పరిసర ప్రాంతాల,దిగువ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– ఏలూరు, జంగారెడ్డిగూడెం, వేలేరుపాడు, కుక్కునూరులలో కంట్రోల్ రూమ్‌లు**



**వేలేరుపాడు/ఏలూరు,మేజర్ న్యూస్ :** పెదవాగు రిజర్వాయర్ నుండి దిగువ విడుదల చేస్తున్న వరద నీరు పెరుగుతున్న దృష్ట్యా పెదవాగు పరిసర ప్రాంతాలు దిగువ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెదవాగు రిజర్వాయర్ నుండి ఇప్పటికే 10 వేల క్యూసెక్కుల వరద నీటిని దిగవకు విడుదల చేశారని రేపటికి ఇది మరింత పెరగవచ్చని దీని కారణంగా వేలేరుపాడు మండలంలోని కుమ్మరిగూడెం, గొల్లగూడెం, వసంతవాడ, గుండం బోరు, మద్దికొండ, లచ్చి గూడెం, రుద్రంకోట, అల్లూరి నగరం, కోయ మాదారం, రామవరం, గొల్లవాయి, రెడ్డిగూడెం, బండ్ల పూర్, భూదేవిపేట, శివకాశి పురం, వేలేరుపాడు 17 నివాసత ప్రాంతాలు వరద ముంపు రావచ్చని, కావున ప్రజలందరూ అధికారులతో సహకరించి సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని కోరారు.అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేయడం జరిగిందని, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన ఆస్తి ప్రాణ నష్టాలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.ఏలూరు కలెక్టరేట్ లో 1800-233-1077 ,94910 41419 ఫోన్ నంబర్లతో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశామని, అదేవిధంగా జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఆఫీస్ లో కంట్రోల్ రూమ్.. ఫోన్ నెంబర్ 8309269056.వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ 8328696546 కుక్కునూరు తాసిల్దార్ కార్యాలయంలో 8096274662 ఫోన్ నెంబర్ తో కంట్రోల్ ఏర్పాటు చేశామన్నారు.బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేశామని, రాష్ట్ర విపత్తు నివారణ దళం ను కూడా సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ వెట్రి సెల్వి తెలియజేశారు

# లోక్ అదాలత్‌తో సమయం,డబ్బు ఆదా





**– రాజీ మార్గమే రాజమార్గం : జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలు ప్రకారం శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన 3వ జాతీయ లోక్ అదాలత్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ ,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ 3281 పెండింగ్ కేసులు పరిష్కరించామని అందులో 3012 క్రిమినల్,149 సివిల్,120 ఎంవిఓపి కేసులు ఉన్నాయన్నారు. ఇరుపక్షాల అంగీకారంతో సామరస్య వాతావరణంలో కేసులు పరిష్కారం చేయడమే జాతీయ లోక్ అదాలత్ లక్ష్యమని కావున కక్షిదారులు కోపావేశాలకు పోకుండా కేసులు పరిష్కారానికి ముందుకు రావాలని అన్నారు.ఈ లోక్ అదాలత్ నందు కేసులు పరిష్కరించు కోవడం వల్ల సమయం,డబ్బు ఆదా అవుతుందని,అ ఇరుపక్షాల మధ్య స్నేహ సంబంధాలు పెరుగుతాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రెండవ వదనపు జిల్లా జడ్జి ఇందిరా ప్రియదర్శిని,5వ అదనపు జిల్లా జడ్జి ఆర్.వి.వి ఎస్ మురళీకృష్ణ,8వ అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాదు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బులి కృష్ణ,అదనపు సీనియర్ సివిల్ జడ్జి సాయి తేజ, ప్రభుత్వ న్యాయవాది బి.జె.రెడ్డి,ఏ.పి.పి, ఏ.వి.నారాయణ,ఏలూరు భార్ అసోసియేషన్ ప్రెసిడెంటు కోనె సీతారాం,ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు,తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి లేని విలువలతో కూడిన రాజకీయాలు చేస్తా

మొదటిపేజి తరువాయి

ఆయన కోరారు. భీమవరం బైపాస్,ఎన్.హెచ్.-165కు నిధుల మంజూరు, నరసాపురానికి వందే భారత్ రైలు, రోడ్డు నిర్మాణానికి సి.ఐ.ఆర్.ఎఫ్. నిధులు, పార్లమెంట్ పరిధిలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలు తన బ్రాండ్‌గా నిలిచాయని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, తనను కలవడానికి మధ్యవర్తులు లేదా అపాయింట్‌మెంట్‌లు అవసరం లేదని ఆయన అన్నారు. వివిధ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలతో నిరంతరం సంప్రదిస్తూ అందరి సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. బాధ్యత లేని వ్యక్తులు తనను కెలికితే తనలోని అపరిచితుడు బయటకు వస్తాడని ఆయన హెచ్చరించారు.

## రూ.24.49.511 లక్షలు సిఎం సహాయ నిధి

మొదటిపేజి తరువాయి

చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి బిల్లులు మంజూరు చేయమని మంత్రిని అడుగగా మంత్రి తక్షణమే స్పందించి కొన్ని రోజులకే చెక్కులు మంజూరు చేయించి బాధిత కుటుంబాలకు అందజేశారు. మెరుగైన వైద్యానికి కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని ప్రజలంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

## తెలంగాణా నుండి పెదవాగుకు వరద ఉధృతి

మొదటిపేజి తరువాయి

నదిలోకి ఎవరూ ఈతకు వెళ్ళకు, చేపలు పట్టడం వంటివి చేయకుండా ఆయా గ్రామాలలో అధికారులు టామ్ టామ్ ద్వారా తెలియ జేయాలన్నారు.ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాలలోబోట్లు , గజఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. గర్భిణీలు, చిన్నపిల్లలు, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.గ్రామ స్థాయిలో రెవిన్యూ,పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక సిబ్బంది, తదితరశాఖల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.

## దానగూడెం బాధితుని పరామర్శించిన నవ ఆశ్రయం ఫౌండేషన్ సభ్యులు

**– కొల్లి బాబిని అరెస్టు చెయ్యాలి**
**– లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం**



**కైకలూరు, మేజర్ న్యూస్ :** విచక్షణ రహితంగా దాడులకు పాల్పడటం దానగుడెం దళిత యువకులు తీవ్రంగా గాయపడిన అజయ్ ఇంటికి వెళ్లి గుడ్లవల్లేరు నవాశ్రయం ఫౌండేషన్ సభ్యులు దాసి సత్యనారాయణ,దారా శివాజీ వారి బృందంతో శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజయ్ బాబు పై అతికిరాతంగా దాడి చేయడం దారుణమని, ఈ ఘటన సోషల్ మీడియా ద్వారానే తెలుసుకొని దానగూడెం వాసులకు మద్దతు తెలపడానికి రావడం జరిగిందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో ఆలోచన విధానంతో రాజ్యాంగ హక్కుల పోరాటానికి శిఖనంగా బాధితులకు న్యాయం చేయాలని, ఘటనకు కారుకులైన కొంతమందిని అరెస్ట్ చేశారని, ఇంకొక వ్యక్తి కొల్లి బాబీ ఉన్నారని తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. లేని పక్షాన రాష్ట్రమంతటా దాన గూడెం ఉద్యమం పేరున ఉద్యమాలు చేస్తామన్నారు. దళితుల జోలికి వస్తే సహించేది లేదన్నారు. బాధిత కుటుంబాలకు భరోసాగా ఉంటామన్నారు. పరామర్శించిన వారిలో ఈదా ముకుందా, చిలంకుర్తి రవి, రామ్నాథ్ కోటి, ప్రశాంత్, కల్లేపల్లి కిరణ్, దాసి దామోదర్ రావులు వున్నారు.

# మున్సిపల్ వార్డుల్లో ఎమ్మెల్యే నాయకర్ సుడిగాలి పర్యటనలు



**– ఆశావాహుల హడావిడి** : చైర్మన్ పదవి జనరల్ అంటూ ప్రచారం

నరసాపురం,మేజర్ న్యూస్: రాష్ట్ర ఎన్నికల సంఘం త్వరలో మునిసిపల్, పంచాయితీ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తుంది. మరొకపక్క కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇటీవల అనంతపురం జిల్లాలో సూపర్ హిట్ పేరిట కూటమి ప్రభుత్వం భారీ సభ నిర్వహించి విజయవంతం చేసింది. ఈ నేపథ్యంలో నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ శుక్రవారం నుండి మునిసిపల్ వార్డులలో సుడిగాలి పర్యటనలు చేస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. అక్కడికి అక్కడే పరిష్కరించగలిగిన సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నారు. సాధారణ ఎన్నికల అనంతరం కూటమి నాయకులు, ఎమ్మెల్యే, అధికారులు తమ ఇంటి ముంగిటకే వస్తుండడంతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా రానున్న మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్, చైర్మన్ అభ్యర్థులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఔత్సాహికులు ఎక్కువమంది ఎమ్మెల్యే వెంట వార్డు పర్యటనలో దర్శనమిస్తున్నారు. ఆయా అవార్డులోని నెలకొన్న సమస్యలను సీట్లు ఆశిస్తున్న నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నరసాపురం మున్సిపాలిటీకి అధిక నిధులు కేటాయిస్తుంది గనుక తమ హయాంలో పనులు చేసినట్లయితే చిరస్థాయిగా తమ పేరు నిలుస్తుందనే ఉద్దేశంతో చాలామంది నాయకులు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. నరసాపురం మున్సిపల్ చైర్మన్ పదవి జనరల్ అభ్యర్థి అయ్యే అవకాశం ఉన్నట్లు విస్తృత ప్రచారం జరుగుతుంది.గతంలో ఈ పార్టీల మధ్య పొత్తు ఉన్న సమయంలో గడచిన పుష్కరాల సందర్భంలో బిజెపి మున్సిపాలిటీని దక్కించుకుంది. చైర్మన్ గా డాక్టర్ కొప్పర్తి వేణుగోపాలరావు పనిచేశారు. ఈసారి కూడా చైర్మన్ టికెట్ తమ పార్టీకి దక్కుతుందన్న విశ్వాసంలో బిజెపి పార్టీ ఉంది.ఇక టిడిపి విషయానికి వస్తే ఎమ్మెల్యేగా జనసేన పార్టీకి చెందిన బొమ్మిడి నాయకర్ పనిచేస్తున్నారు. దీంతో మునిసిపల్ చైర్మన్ పదవి తమ పార్టీకే దక్కుతుందని టిడిపి నాయకులు, ఆశావాహులు ధీమాగా ఉన్నారు. ఇక జనసేన విషయానికి వస్తే నరసాపురం ఏఎంసి పదవి టిడిపి దక్కించు కోవడంతో మున్సిపల్ చైర్మన్ పదవి తమ పార్టీకే దక్కుతుందని జనసేన నాయకులు నమ్ముతున్నారు. ఏది ఏమైనప్పటికీ మరి కొద్ది రోజులు వేచి చూస్తే తప్ప ఈ సస్పెన్స్ కు తెరపడదు.

# శ్రీ సూర్య డిగ్రీ కళాశాలలో ఘనంగా 'ఫ్రెషర్స్ డే




**నరసాపురం,మేజర్‌న్యూస్** : స్థానికశ్రీ సూర్య డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయ నిర్మల,గౌరవ అతిథిగా ఏపీఎస్ సిహెచ్ ఈ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ షేక్ సులేమాన్ హాజరయ్యారు.జ్యోతి ప్రజ్వలన, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ గీతంతో ప్రారంభించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ పి. విజయ నిర్మల మాట్లాడుతూ' మన సమాజానికి అమ్మాయి చదువు చాలా అవసరం, చదువుకున్న అమ్మాయిల వలనే మంచి సమాజం నిర్మితమవుతుంది, ఒత్తిడి లేని విద్యా ప్రణాళిక ప్రతి ఒక్క విద్యార్థి ఏర్పాటు చేసుకుని, ఉన్నత లక్ష్యం దిశగా కృషి చేయాలనీ సూచించారు.గౌరవ అతిథి డాక్టర్ షేక్ సులేమాన్ మాట్లాడుతూ వ్యక్తిత్వ విలువలు, అనుభవాన్ని గౌరవించడం చాలా అవసరం. జీవితంలో అద్భుతంగా రాణించాలంటే బాగా చదవాలి,బాగా రాయగలగాలి, బాగా మాట్లాడగలగాలి అన్నారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో శ్రీ సూర్య విద్యా సంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ,డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి. పుల్లారావు, అకడమిక్ ప్రిన్సిపల్ టి.కృష్ణ గుప్తా, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఏ ఆర్ ఎస్ కుమార్, బి. రామచంద్ర రెడ్డి, డాక్టర్ ఫాజల్, డాక్టర్ కె.జానకిరామ్, డాక్టర్ ఆర్. సతీష్, వేణుగోపాల్, సిహెచ్ కరుణకుమార్, కేశవ, సత్య, రామకృష్ణ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# దానగూడెం దళితులకు జనసేన ఇంచార్జి అప్పల నాయుడు పరామర్శ





**కైకలూరు,మేజర్‌న్యూస్:** ఈనెల 5వ తేదీన కైకలూరులో జరిగిన ఘర్షణలో గాయపడిన దానగూడెం దళితవాడకు చెందిన బాధితులను శనివారం ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పలనాయుడు పరామర్శించారు. దానగూడెంలోని ఐబీఎమ్ చర్చిలో బాధిత కుటుంబ సభ్యులను, గ్రామస్థులను ఆయన పరామర్శించారు.యువకులతో మాట్లాడానని వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారని వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండదని తెలిపారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం అధిష్టానం ఆదేశాల మేరకు దానగూడెం దళితవాడకు చెందిన బాధితుల పరామర్శకు వచ్చానన్నారు. ఇకపైన ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సంఘటనకు కారణమైన వారు పోలీసు వారి అదుపులో ఉన్నారని తెలిపారు. ఇకపైన కైకలూరులోని ప్రజలందరూ కులాలు మతాలకు అతీతంగా సోదరుల వలే కలిసి ఉండాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘ విద్రోహుల వలలో పడకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. పరామర్శించిన వారిలో జనసేన ఏలూరు నగర అధ్యక్షులు వీరంకి అంజిత్ కుమార్ (పండు), జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని,జనసేన పార్టీ నాయకులు, మైకాపుల రామాంజనేయులు, వీర మహిళలు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ముదునూరు సర్పంచ్ సంవాద్ కాన్ క్లేవ్‌కు ఆహ్వానం




**పెంటపాడు,మేజర్ న్యూస్** : పెంటపాడు మండలం ముదునూరు సర్పంచ్ భావన ధాన్యలక్ష్మి కు అరుదైన అవకాశం దక్కింది. ఢిల్లీలో ఈ నెల సెప్టెంబర్ 15న భారత నాణ్యతమండలి (క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహించ నున్న సర్పంచ్ సంవాద్ కాన్ క్లేవ్ కు ఆహ్వానం అందింది. జలశక్తి మంత్రిత్వ శాఖ సహకారంతో జరగనున్న సదస్సుకు దేశావ్యాప్తంగా 75 మంది సర్పంచులు ఎంపిక చేయగా అందులో భావన ధాన్యలక్ష్మి స్థానం దక్కించుకొన్నారు.

# ఆర్.ఎస్.ఎస్ ఘోష్ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా కవాతు





**ఏలూరు,మేజర్‌న్యూస్** : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఏలూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఘోష్ (బ్యాండ్) శిక్షణ శిబిరం శనివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ఈ శిబిరంలో పాల్గొన్న రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన శిక్షార్థులు, ఆర్.ఎస్.ఎస్ ప్రముఖులు వన్ టౌన్ పరిధిలో రూట్ మార్చ్ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ఈ కవాతు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. కుండీబొమ్మ సెంటర్, గడియారం స్తంభం, కన్నయ్య పార్క్, పెద్ద వంతెన, చందనా బ్రదర్స్, కూరగాయల మార్కెట్, రామకోటి ప్రాంతాల మీదుగా ఈ రూట్ మార్చ్ ముందుకు సాగింది. ఈ సందర్భంగా పురవీధులలో మహిళలు పూలు చల్లుతూ కవాతులో పాల్గొన్న వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన బ్యాండ్ వాదకులతో పాటు ఇతర జిల్లా, విభాగ్, రాష్ట్రస్థాయి ఆర్.ఎస్.ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.ఈ కవాతు ద్వారా సంఘ్ సేవ, క్రమశిక్షణ, దేశభక్తి వంటి ఆశయాలను ప్రజలకు చాటిచెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి - ఇద్దరికి గాయాలు



**కొయ్యలగూడెం రూరల్, మేజర్ న్యూస్** : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురం గ్రామ శివారున శని వారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ఆర్యపురం, కృష్ణ నగర్‌కు చెందిన నల్ల మట్టి రాంబాబు (58) సం. రాజమండ్రి నుండి కొయ్యలగూడెం తన సొంత పనుల మీద వచ్చి తిరిగి వెళ్ళుచుండగా, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం బుచ్చంపేట గ్రామానికి చెందిన తామ శ్రీరామ్ అతని తల్లితో మితిమీరిన వేగంగా తన ద్విచక్ర వాహనాన్ని నడుపుకుంటూ రాజమండ్రి వెళుతున్న రాంబాబును ఎదురుగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

తామ శ్రీరామ్‌ను అతని తల్లిని కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# కనికరించి ఇల్లు ఇస్తే - ఏకంగా కబ్జాకే పాల్పడ్డారు





**- ఇదేమిటి అన్యాయం అని ప్రశ్నిస్తే దాడికి తెగబడ్డారు**

**- ఉండి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన**

**ఉండి,మేజర్ న్యూస్** : ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని చెప్తే ఆశ్రయం కల్పించినందుకు అదే ఇంటిని కబ్జా చేసిన సంఘటన పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వరుసకు చెల్లెలు అవుతుంది కదా అని కనికరించి ఉండేందుకు ఇల్లు ఇస్తే... ఏకంగా కబ్జా చేసేందుకు కుట్రపన్నారు. నా ఇల్లు నాకు అప్ప చెప్పమని కోరితే దాడులకు పాల్పడ్డారు ఇదేమని ప్రశ్నిస్తే పోలీసు కేసులు సైతం పెట్టారు...ఇదీ మండల కేంద్రమైన ఉండి గోరింతోట ప్రాంతానికి చెందిన కొల్లి సుందరం కుటుంబ సభ్యుల ఆవేదన. పూర్తి వివరాల్లోకి వెళితే గోరంతోట వంతెన సమీపంలో కొల్లి సుశీలమ్మకు సుమారు 10 సెంట్లు స్థలములో ఒక పెంకుటిల్లు, ఒక రేకు షెడ్ ఉన్నాయి.ఆమెకు సంతానం లేనందున సుందరము అనే వ్యక్తిని సుశీలమ్మ దత్తత తీసుకున్నారు. గతంలో సుందరం కుమారుడు కొల్లి ప్రఖ్యాత పేరిట ఈ ఆస్తి సెటిల్మెంట్ దస్తావేజును సైతం రాశారు. అయితే ఉపాధి నిమిత్తం సుందరం కుటుంబ హైదరాబాద్ ప్రాంతంలో సెటిల్ అవ్వటంతో చెల్లెలు వరుసు అయ్యే మేడపాటి రోజా రాణి, ఆమె భర్త ఆమోసును అందులో ఉండమని చెప్పారు. సంవత్సరాలు గడిచాయి కొద్దిరోజుల్లో తాము సైతం ఇక్కడికి వచ్చేస్తామని మీరు ఎక్కడైనా ఇల్లు చూసుకోండి అని ఇటీవల సుందరం కుటుంబ సభ్యులు ఆమోస్ కుటుంబానికి చెప్పారు. దీంతోఎవరిల్లు ఎందుకు ఖాళీ చెయ్యాలి ఇది మా ఇల్లు అంటూ ఆమోస్ కుటుంబ సభ్యులు సుందరం కుటుంబ సభ్యులపై ఎదురుదాడికి దిగినట్లు వారు వివరించారు. దీనిపై దొంగ స్తావేజులను సృష్టించుకుని ఇంటిని కాజేసేందుకు కుట్ర పన్నారని వారు వాపోయారు. ఈ విషయమై స్థానికి పెద్దల సమక్షంలో ఎన్నిసార్లు వారించినా వారిలో మార్పు రాలేదు. దీంతో తమకున్న హక్కుతో వారిని ఇంటి నుంచి ఖాళీ చేయించి పంపించామని వారు వివరించారు. ఈ క్రమంలో తమపై తప్పుడు పోలీస్ కేసులు పెట్టారని వారు ఆందోళన చెందారు.అలాగే మీడియా ముఖంగా తమ కుటుంబాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నారని వారు ఆవేదన చెందారు కావున ఇకనైనా ఇలాంటి చర్యలను విడనాడాలని, లేనిపక్షంలో న్యాయపోరాటానికి దిగుతామని వారు స్పష్టం చేశారు. లేనియెడల వారిపై చట్టరీత్యా పరువు నష్టం కేసు వేస్తామని సుందరం కుటుంబ సభ్యులు వెల్లడించారు.దొంగ దస్తావేజులు సృష్టించి ఇల్లులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న మేడపాటి ఆమోసు ఆమె భార్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇటువంటి వ్యక్తులు సమాజంలో చీడపురుగుల్లా తయారై మానవ విలువలను మంట కలుపుతున్నారని వారు అన్నారు. కావున సంబంధిత అధికారులు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# సిఎం సహాయ నిధి ఎల్ ఓసి అందజేసిన విప్ నాయకర్

**నరసాపురం, మేజర్ న్యూస్** : మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన తుళ్ళూరి గిరిధర్ రావు తన ఇద్దరు కవల పిల్లలు కోమల్ వెంకట్ అండ్ కోమల్ విరాట్ ఆనంద్ వినికిడి లోపంతో బాధపడుతూ చికిత్స కోసం రూ. 18,54,500 వ్యయం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ కు తెలియజేశారు. వెంటనే స్పందించిన నాయకర్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా



ఎల్ఓసి మంజూరు చేసి ఇద్దరూ పిల్లలకు చికిత్స నిమిత్తం రూ. 18,54,500 అయ్యే ఖర్చు ప్రభుత్వం ద్వారా మంజూరు అయ్యే విధముగా చర్యలు చేపట్టారు.

శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ, పిల్లలకు త్వరలోనే మంచి జరుగుతుం దని నాయకర్ భరోసా కల్పించారు.

# సంక్షేమ శాఖ గురుకుల విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి





**- విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామయ్య**

**ఏలూరు,మేజర్న్యూస్** :సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాలలో ఉద్యోగులుగా 30 నుండి 35 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ అనంతరం తమకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.కామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం స్థానికకెనాల్రోడ్డులోగల యు.టి.ఎఫ్.,కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కె.కామయ్య మాట్లాడుతూ 2020 నుండి ఇప్పటివరకు 550మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారని, వీరికి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్,అరియర్స్ నేటికీ చెల్లించే లేదని ఆవేదన వ్యక్తం చేశారు.65 మంది విశ్రాంత ఉద్యోగులు తమ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందకుండానే చనిపోయారని పేర్కొన్నారు.2014 నుండి మెడికల్ బిల్లులునేటికీ చెల్లించలేదని విమర్శించారు. డి.ఎ.,బకాయిలు 2018 నుండి 2021 వరకు చెల్లించలేదని,ఎర్న్ లీవ్స్,ఫైనల్ సెటిల్మెంట్, గత 6 సంవత్సరములుగా చెల్లించలేదన్నారు. కానీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల రాష్ట్ర సంస్థ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది మాత్రం తమకు రావలసిన బెన్ఫిట్స్ పొందారని ఆరోపించారు. శాఖా పరంగా అందరికీ ఒకే విధమైన నిబంధన ఉంటుందని, గురుకుల విద్యాలయాల రాష్ట్రప్రధానకార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిరిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణం పొందుతుండగా, సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి మాత్రం బెనిఫిట్స్, అరియర్స్ చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల సొసైటీ ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణం పొందుతుండగా సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల ఉద్యోగులు మాత్రం తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్ అయిన 550 మంది ఉద్యోగులకు ఎంత మొత్తంలో బెనిఫిట్స్, అరియర్స్ చెల్లించాలో రాష్ట్ర ప్రధాన కార్యాలయం వద్ద సరైన సమాచారం కూడా లేదని ఆరోపించారు.ప్రభుత్వం తక్షణం తమ సమస్యలపై దృష్టిసారించి రిటైర్ ఉద్యోగుల హక్కులను రక్షించడానికి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# మృతి చెందిన జనసేన సభ్యుని కుటుంబానికి రూ.5లక్షలు చెక్కు



**ఇరగవరం మేజర్ న్యూస్** : మండలంలోని కె.ఇల్లిందలపర్రు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త మోరాం హరీష్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందటంతో ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసినట్లు జనసేన పార్టీనాయకులు ఆకేటి కాశీ చెప్పారు. మృతి చెందిన వ్యక్తి జనసేన క్రియాశీలక సభ్యత్వం ఉన్నందున ప్రమాద బీమా వర్తించినట్లు చెప్పారు. భీమా మొత్తం రూ.5 లక్షలు చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ఇరగవరం మండల అధ్యక్షులు, అత్తిలి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్, దాసం ప్రసాదు, టీడీపీ తణుకు టౌన్ ప్రెసిడెంట్ కొమ్మిరెడ్డి శ్రీనివాస్, తణుకు మండలాధ్యక్షులు చిక్కాల వేణు, తణుకు టీడీపీ నాయకులు బెజవాడ సూరి, కె. ఇల్లిందలపర్రు గ్రామటీడీపీ నాయకుడు ఏడిద నారాయణ మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.ఇది జనసేన కార్యకర్తల పట్ల పార్టీ చూపుతున్న అభిమానం, కట్టుబాటు, బాధ్యతా భావానికి నిదర్శనం.

# వరదలలో ఇద్దరు మహిళల గల్లంతు



**జీలుగుమిల్లి మేజర్ న్యూస్** : తెలంగాణ రాష్ట్రంలో శనివారం కురిసిన భారీ వర్షాలకు మండలానికి చెందిన ఇద్దరు మహిళలు గల్లంతయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి మండలం పూచికపాడు గ్రామానికి చెందిన పాలడుగుల చెన్నమ్మ (50), పచ్చిశెల వరలక్ష్మి(55) వరదలలో గల్లంతయ్యారు. ఐదుగురు మహిళలు సురక్షితంగా ఒడ్డికి చేరుకున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం తెలంగాణ రాష్ట్రంలోని కావెడీగుండ్ల గ్రామానికి వెళ్లిన ఏడుగురు మహిళలు సొంత గ్రామం పూచికపాడుకు వస్తుండగా చెన్నాపురం గ్రామ సమీపంలోని వాగు దాటే సమయంలో వరద ఉధృతికి ఏడుగురు మహిళలు కొట్టుకుపోగా ఐదుగురు సురక్షితంగా బయటికి చేరుకున్నారు మిగిలిన ఇద్దరు గల్లంతు కావడంతో వారికోసం స్థానికులు గాలింపు చేపట్టారు. జరిగిన సంఘటనపై జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెన్నాపురంలో వరదలో కొట్టుకుపోయిన మహిళల కోసం గాలింపు చర్యలు చేపట్టేందుకు ఎన్డీఆర్ఎఫ్ అగ్నిమాపక శాఖ పోలీస్ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కొండ కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ఎవరు వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు వీరితోపాటు జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ రాజు,జీలుగుమిల్లి వేరుపాడు ఎస్సైలు క్రాంతి కుమార్,పినవీన్ కుమార్, అశ్వరావుపేట పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్ని బాధితురాలికి వైసీపీ నేతల సహాయం



**వేలేరుపాడు,మేజర్ న్యూస్** : మండలంలోని రేపాక గొమ్ము గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వంకోల్పోయిన కారం బాయమ్మ అనే మహిళను జడ్పీటిసి గుజ్జా రామలక్ష్మి,ఎంపీపీ వాళ్ళ రామలక్ష్మి,ఎంపీటీసీ కొమర్రాజు రాంబాబు,వైసీపీ పార్టీ నాయకులు శనివారం పరామర్శించి 7 వేల రూపాయల నగదు,వంట సామాగ్రి,నిత్యవసర సరుకులు అందజేశారు. ఇళ్ళు పూర్తిగా కాలి పోయి కట్టుబట్టలతో మిగిలిన బాయమ్మను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కురిమెళ్ళ రమేష్, గేరా చక్రి,ములిశెట్టి రాము,బిక్షం,ఆదిలక్ష్మి,వేణు,లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# 7,8 వార్డులలో కూటమి నేతలు పర్యటన





**-దేశం నేత నాయుడు నివాసం దగ్గర ప్రారంభం**

**- పెద్ద ఎత్తున పాల్గొన్న అభిమానులు**

**నరసాపురం,మేజర్ న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారణకై నరసాపురం పట్టణం లో రెండవ రోజు శనివారం చేపట్టిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున అభిమానులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతి నిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. శనివారం స్థానిక ఏడవ వార్డులోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజ నాయుడు నివాసం దగ్గర ప్రారంభించారు. నాయుడు వ్యక్తిగత కార్యదర్శి శంకు భాస్కర్ నాయుడు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, తెలుగుదేశం పార్టీ ఇన్చా ర్జ పొత్తూరి రామరాజులకు పూల బొకేలు అందజేసి స్వాగతం పలికారు. ఏడవ వార్డులో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకొని కొన్ని సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత శాఖల అధికారులను నాయకర్ ఆదేశించారు. అనంతరం 8వావార్డు వార్డుకి వెళ్లిన నాయకులకు వార్డు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. వార్డులో డ్రైనేజీ వ్యవస్థ పారిశుధ్యం గురించి 5 సంవత్సరాలు వైయస్సార్ పార్టీ గాలికి వదిలేసిందనినాయకర్,రామరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు,కొప్పాడ రవి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కొలసన శ్రీ పద్మ,తోట అరుణ, కొప్పాడ కృష్ణవేణి,మల్లాడి శ్రీనివాస్,కొప్పాడ నరేష్, మల్లాడి బాలు, కొప్పాడి అనంత,పోలిశెట్టి సాంబ, పాలూరు బాబ్జి, తదితరులుపాల్గొన్నారు.

# అధ్యాపకులు అంకిత భావంతో పనిచేయాలి : డిఐఈఓ ప్రభాకర్ రావు



**తాడేపల్లిగూడెం, మేజర్న్యూస్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జి.ప్రభాకర్ రావు అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న రసాయన శాస్త్ర అధ్యాపకులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ప్రధాన అధ్యపకురాలు నాగవేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభాకర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో ప్రభుత్వం పలు మార్పులు తీసుకువస్తుందన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పాఠ్యపుస్తకాలు, మార్కుల్లో మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. అధ్యాపకులు మారిన పుస్తకాలకు అనుగుణంగా విద్య బోధన చేసి విద్యార్థులను చైతన్యవంతం చేయాలన్నారు. విద్యార్థులు బాల్యం నుండి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని అన్నారు. బాగా చదివి మంచి మార్కులు సాధించి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ నాగవేణి మాట్లాడుతూ మంచి యువత సమాజానికి ఎంతో అవసరం అన్నారు. మీరంతా మంచి విద్యాబుద్ధులు నేర్చుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# శతాధిక గిరిజన నాయకుడు 'చదలకు' ఘన నివాళులు





**- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య,ఎస్టీ ఉద్యోగుల సంఘం జాతీయ నేత 'దేవరకొండ '**

**నందిగామ / ఏలూరు,మేజర్ న్యూస్ :** వందేళ్ళ వయసుకు పైబడిన ప్రముఖ గిరిజన నాయకులు చదల జానకి రామారావు మృతికి నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య , ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆల్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు , విభిన్న ప్రజా సంఘాల నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేసి , తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తొలుత జానకి రామారావు కుటుంబ సభ్యుల్ని పరామర్శించి, ఆయన సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న గిరిజనులకు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించే సందర్భంలో , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందే మద్రాస్ ప్రెసిడెన్సీ హయంలో ఆదివాసీల రిజర్వేషన్స్ కోసం ఆనాటి ప్రముఖ ఆదివాసీ నాయకులైన పాలపర్తి వీరయ్య , పొన్న కోటేశ్వరరావు, పొన్న సత్య నారాయణ,వడిత్యా గోపాలరావు నాయక్, తిరువీధుల సాంబయ్య, రామేశ్వరం కోటయ్య, తదితర నాయకులతో కలిసి బుర్రకథలు ద్వారా,విబిన్న సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా గిరిజనులను చైతన్య పరిచేవారన్నారు. భారత దేశవ్యాప్తంగా సంచర జాతులుగా అర్ధసంచార జాతులుగా ఉన్న గిరిజనులను గుర్తించి వారిని ఎస్టీ జాబితాలో చేర్చడానికి జానకి రామారావు అత్యంత కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ ఆల్ ఇండియా నాయకులు సాతుపాటి నరసయ్య, మురళీకృష్ణ ,మొగిలి రఘు,శ్రీని వాసరావు, శ్రీధర్, విభిన్న గిరిజన సంఘాల నాయకులు తిమ్మసర్తి నాగేశ్వరరావు,గాలేటి గాంధీ, వశిష్ట, వేణు, బొజ్జగాని నాగ మల్లేశ్వరరావు, చదల ఆంజనేయులు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ యల్లా శ్రీనివాసరావు





**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం మండలం ఈ నెల 8వ తేదీన అరుగొలను గ్రామం చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించిన విషయం తెలిసింది, మృత దేహం సంబంధించిన బంధువులు ఇప్పుడు వరకు ఎవరు రాకపోవడంతో తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యల్లా శ్రీనివాస రావు తన సొంత ఖర్చులతో గుర్తు తెలియని మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వని చాటుకున్నారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ యల్లా శ్రీనివాస రావు ను పలువురు అభినందించారు.

### ఎమ్మెల్యే పితానితో దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ జిన్నా భేటీ



**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆశీస్సులతో నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన షేక్ సయ్యద్ అలీ జిన్నా గురువారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా శాల్వాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఇచ్చిన పదవికి ఇవన్నీ తెచ్చే విధంగా పనిచేస్తానని కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, మైనార్టీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు,కృతజ్ఞతలు తెలిపారు.

### దానగూడెం ఘటనకు జనసేనకు సంబంధం లేదు

**- మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై జనసేన నేతలు ఖండన**



**కైకలూరు,మేజర్న్యూస్ :** దానగూడెం ఘటనను జనసేన పార్టీకి ఆపాదించడం సరికాదని కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకులు నల్లగోపుల చలపతి,ఏ.ఎన్.బాబులు తెలిపారు. శనివారం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్ నందు జనసేన నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఇద్దరి మధ్య గొడవను రెండు కులాల మధ్య గొడవగా,జనసేన పార్టీ గొడవగా సృష్టిస్తున్నారని దీనిని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని జనసేన పార్టీ నాయకులు అన్నారు. జనసేన పార్టీ అంటే దళితుల పార్టీ అని, జనసేన ఎప్పుడు దళితుల కోసం పోరాడడంలో ముందుంటుందని, నియోజకవర్గంలో దళితులకు మరియు కాపులకు మంచి సంబంధాలు ఉన్నాయని నియోజకవర్గంలో ఇటువంటి గొడవలు ఎప్పుడు జరగలేదని, ఈ గొడవకు పార్టీకి సంబంధం లేదని జనసేన నాయకులు అన్నారు. జనసేన పార్టీలో పదవిలేని ఒకరు చేసిన పనిని జనసేన పార్టీకి అంటగట్టడం సరైన పద్ధతి కాదని జనసేన మండల అధ్యక్షుడు ముమ్మారెడ్డి నాగమల్లేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పైడిపాటి శివశంకర్, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, బోయిడి సురేష్,సుధా నాని,పుప్పాల సూర్యప్రకాశరావు, పెరుగు నాగరాజు, బొక్క వెంకటరావు,నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీలో 38వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ 38వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏలూరులోని దొండపాడులోగల పరివర్తన్ బధిరుల పాఠశాలలోఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ(యు.ఈ.టి.ఎస్) తమ 38వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంతో వైభవంగా జరుపుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జి.వి.వి. సత్యనారాయణ 8ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. మొదటగా ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎస్.పి. రెడ్డికి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, 1988 సెప్టెంబర్ 13న కాకినాడలో మానసిక దివ్యాంగుల కోసం స్థాపించబడిన ఈ సంస్థ, 38 సంవత్సరాలుగా నిరంతరాయంగా దివ్యాంగుల అభ్యున్నతికి, సమాజ పురోగతికి కృషి చేస్తోందని కొనియాడారు. ప్రస్తుతం దాదాపు రెండు వందల మంది సిబ్బందితో,వేలాది మంది దివ్యాంగులకు సేవలు అందిస్తూ,అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు, హియరింగ్ ఎయిడ్స్, ట్రై సైకిళ్లు, చక్రాల కుర్చీలు వంటివి అందించి వారి జీవితాలను మెరుగు పరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే,ఉత్తమ సంస్థగా రాష్ట్రపతి అవార్డును, 2019లో మరోసారి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ద్వారా అవార్డుతో పాటు ఐదు జాతీయ అవార్డులను అందుకుందని గుర్తు చేసుకున్నారు. అనంతరం సంస్థ కో-ఆర్డినేటర్ డి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ వివిధ మార్గాల ద్వారా దివ్యాంగులకు అనేక రకాల సేవలను అందించడంలో ముందుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ప్రత్యేక డి.ఎడ్. కళాశాల సిబ్బంది, డి.డి.ఆర్.సి. సిబ్బంది,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 184 కేసులు పరిష్కారం



**నరసాపురం, మేజర్ న్యూస్:** స్థానిక కోర్ట్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 184 కేసులు పరిష్కరించినట్లు నర్సాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్,10వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి తెలిపారు.లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ పంతాలకు పోకుండా సమన్వయంతో రాజీ చేసుకుంటే ఇరు పార్టీలు సంతోషంగా ఉండవచ్చును. అదాలత్ లో సివిల్ కేసులు25, ఇన్సూరెన్స్ కేసులు.3 నర్సాపురం టౌన్,రూరల్, మొగల్తూరు, యలమంచిలి పోలీస్ స్టేషన్ లకు సంభందించిన క్రిమినల్ కేసులు -73, ఎక్సైజ్ కేసులు..11,చెక్ బౌన్స్ కేసులు -02 బిఎస్ఎన్ఎల్-4 కేసులు ,బరోడా బ్యాంక్ కేసులు..3 , బెంచ్ కోర్ట్ కేసులు 63 మొత్తం 184 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజి చేసినట్లు 10వ అధనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి పత్రికలకు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ను 3 బెంచ్ లుగా ఏర్పాటుచేశారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి. గంగ రాజు, అదనపు.సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎస్. రాజ్య లక్ష్మి సభ్యులుగా బి. నారాయణ స్వామి, కె. అన్నపూర్ణ, రజనీ బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బూసి విశ్వేశ్వరరావు, కార్యదర్శి వెన్న ప్రకాష్, కోర్టు లైజన్ ఆఫీసర్ భాస్కరరావు, పోలీస్ అధికారులు సీనియర్ జూనియర్ న్యాయవాదులుపాల్గొన్నారు. మొత్తం కోటి పందొమ్మిది లక్షల తొంభై మూడు వేల ఏడు వందల రూపాయలకు అవార్డులను జారీ చేసినట్లు న్యాయమూర్తి వాసంతి తెలిపారు.సీనియర్ న్యాయవాది పి . వి.వి. నారాయణ స్వామి కక్షి దారులకు ఏర్పాటు చేశారు.

## ప్రధాన కాలువలో గుర్తు తెలియని మృతదేహం



**నరసాపురంరూరల్, మేజర్‌న్యూస్ :** మండలంలోని రుస్తుం బాద పంచాయతీ పరిదిలో నరసాపురం ప్రధాన కాలువ లో గుర్తుతెలియని అడ మృతదేహాన్ని స్థానికులకు గుర్తించి శుక్రవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి వివరాలు సేకరిస్తున్నారు. మృతురాలు వద్ద ఏ వివరాలు లేవు.మృతురాలు వయసు 40నుండి 45 ఏళ్ళు ఉంటుందని అంచనావేస్తున్నారు. మృతురాలు ఒంటిపై ఎరుపు రంగు చీరపై తెల్లచుక్కల డిజైన్, గాచ్చకాయ రంగు (గ్రే) రంగు బ్లౌజ్ ధరించి ఉన్నారు. వివరాలు తెలిసినవారు నరసాపురం రూరల్ పోలీసులను సంప్రదించాలని తెలియజేశారు.

# మాజీ మంత్రి 'కొట్టు' అసత్య ప్రచారం మానుకోవాలి : జనసేన



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** నిజాయితీగా పనిచేస్తున్న శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పై మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అసత్య ప్రచారం మానుకోవాలని జనసేన నేతలు కోరారు. కొట్టు రెండు సార్లు గాలివాటంలో గెలిచారు తప్ప ప్రజాబలంతో గెలవలేదని పలువురు జనసేన నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.పట్టణంలోని జనసేన నాయకుడు ఉంగరాల శ్రీనివాస్ నివాసంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి జనసేనలో చేరిన పలువురు ముఖ్య నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొట్టు గాలివాటం లో గెలిచారు తప్ప తన సొంత చరిష్మా తో గాని, ప్రజా బలంతో గాని గెలవలేదని వారు పేర్కొన్నారు. 2004లో వై.యస్. రాజశేఖర్ రెడ్డి గాలి, 2019లో వై.యస్. జగన్మోహన్ రెడ్డి గాలిలో ఆయన ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న బొలిశెట్టి శ్రీనివాస్ కు జనంలో సొంత చరిష్మా ఉందన్నారు. ప్రజా బలంతో గెలిచారన్నారు.కొట్టు ఎవరి నుంచి లంచాలు తీసుకోలేదని ఆయన ఇష్ట దైవమైన ఆంజనేయ స్వామి మీద ప్రమాణం చేయగలరా అని సవాల్ విసిరారు. తామంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా మొదటి నుంచి ఎంతో కష్టపడి పని చేసామన్నారు. అలాంటిది కొట్టు వైసీపీలోకి వచ్చాక పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన తమలాంటి వారిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఆయన అవినీతి, అరాచకం, అహంకారం, అక్రమాలకు విసుగెత్తిపోయి గత ఎన్నికల ముందు వైసీపీని వీడి జనసేనలో చేరడం జరిగింది అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధికారంలో ఉన్నా, లేకపోయినా ఎవరికి కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆదుకున్నారన్నారు.ఈ విలేకరుల సమావేశంలో జనసేన, టిడిపి నాయకులు ఉంగరాల శ్రీనివాస్ తో పాటు మేడపాటి చెల్లారెడ్డి, పైబోయిన వైదేహి, చింతకాయల సత్యనారాయణ, అడ్డాల నరసింహారావు, చిత్తూరి నాగేంద్ర, దూద్ భాష, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## నిలువ నీడ లేదు - ఎక్కడానికి పల్లె వెలుగు లేదు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయానికి శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో జోరున వర్షంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.స్వామివారి దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో చాలీచాలని బస్టాండ్‌లో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.కనీసం మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు ఏపీ ఏపీఎస్ ఆర్టీసీ వారు పల్లె వెలుగు బస్సులను అందుబాటులో పెట్టకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## కుంపెని వాగు పొంగిపొర్లడంతో పలు గ్రామాల రాకపోకలు స్తంభించాయి



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఆగిరిపల్లి మండలం భారీగా వర్షాలు కురుస్తున్నాయి.ఈ వర్షాలతో శనివారం కుంపెని వాగు పొంగిపొర్లడంతో మండల కేంద్రమైన ఆగిరిపల్లి గ్రామానికి నూగొండపల్లి, తోటపల్లి గ్రామాల ప్రజలు ఇరువైపులా రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా మండల రెవిన్యూ,పోలీస్ అధికారులు ప్రజల రాకపోకలపై తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## ఎమ్మెల్యే పితానికి కృతజ్ఞత తెలిపిన టిడిపి నేత చంటి



**పెనుగొండ, మేజర్ న్యూస్:** పెనుగొండ మండలం వడలి గ్రామానికి చెందిన గ్రామ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఉప్పలపాటి చంటిని పెనుగొండ మండల తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రమోట్ చేసిన సంద ర్భంగా సదరు గ్రామానికి చెందిన అంగర వర ప్రసాద్,బొర్రా త్రిమూర్తులు,గణపతినీడి బుల్లియ్య ,అడిగర్ల నరసింహమూర్తి, మేకా శివయ్య ,కంకిపాటి శ్యాంబాబు, గుల్లిపల్లి రాంబాబు లతో ఉప్పలపాటి చంటి మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

## పల్లపు వీధిలో పంచాయితీ నిధులతో సీసీ డ్రైన్ నిర్మాణం



**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** పెనుమంట్ర గ్రామ పంచాయతీ పరిది లో పల్లపు వీధిలో ప్రసాద్ రెడ్డి ఇంటి ప్రక్క నుండి సీసీ డ్రైన్ వ్యాయం రెండు లక్షలు పంచాయితీ నిధుల తో నిర్మాణాన్ని ప్రారంభించినట్లు సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక , ఉప సర్పంచ్ భూపతి రాజు వెంకట శ్రీనివాసరాజు అన్నారు,ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రసాద్ రెడ్డి,కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీలో ఎన్నికైన అభ్యర్థులకు అభినందనలు





**- సిఎం చంద్రబాబు వంటి నాయకుడు దొరకడం రాష్ట్రం అదృష్టం**

**- ఎంపీ పుట్టా మహేష్ కుమార్,ఎమ్మెల్యేలు చింతమనేని,బడేటి**

**ఏలూరు,మేజర్‌న్యూస్** : చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శిక్షణ తీసుకుని, ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులైన 36 మంది అభ్యర్థులకు అభినందన కార్యక్రమం సీఆర్ రెడ్డి డిగ్రీ కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏర్పాటు చేసిన ఈ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది నిరుద్యోగులు శిక్షణ తీసుకుని తమ కలలు నెరవేర్చుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు.ఈ ట్రస్ట్ ద్వారా 36 మంది యువతీ యువకులు టీచర్లుగా ఎంపికవటం చాలా గొప్ప ఎంపీ విషయమన్నారు. ఇటువంటి గొప్ప కార్యక్రమం చేస్తున్న ప్రభాకర్‌కి అభినందనలు తెలియ చేస్తున్నానన్నారు ముఖ్య మంత్రి చంద్రబాబు,నారా లోకేష్ అన్న మాట నిలబెట్టుకుంటూ మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. నిరంతరం రాష్ట్ర ప్రజలగురించి,భవిష్యత్ తరాలగురించి ఆలోచించే చంద్రబాబుగారు వంటి నాయకుడిని, ఇటువంటి ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. మరో 20 ఏళ్ళు టీడీపీ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటే రాష్ట్రం దేశంలోనే నెంబర్ 1గా మారుతుందన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్,బడేటి రాధాకృష్ణయ్య,జిల్లా ఎస్పీప్రతాప్ శివ కిషోర్,ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు మెగా డిఎస్సీ అభ్యర్థులు ప్రజలు పాల్గొన్నారు.

# స్త్రీల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద ఎత్తున అవగాహన



**- కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం**

**భీమవరం,మేజర్ న్యూస్** : కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వస్థ నారి శసక్త పరివార్ అభియాన్ కార్యక్రమంపై (ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం) సంబంధిత అధికారులతో శనివారం కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ స్వస్థ నారి శసక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్త్రీల ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన, పరీక్షలు, చికిత్సలు ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ఈనెల ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుపరచుటకు చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్ హెచ్ ఓను ఆదేశించారు.సామాజిక, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ,వైద్య కళాశాల ఆసుపత్రులు అధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులు సహకారంతో మహిళలు ,పిల్లల కేంద్రీకృత ఆరోగ్య శిబిరాలు నిర్వహణ, స్క్రీనింగ్, అవహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. క్యాన్సర్ స్క్రీనింగ్, ప్రసూతి సంరక్షణ, తల్లి, పిల్లల రక్షణ, ఇమ్యునైజేషన్, రక్తహీనత స్క్రీనింగ్ రక్తదానం, టి.బి స్క్రీనింగ్, అధిక రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, ఆనారోగ్య మహిళలకు క్షయవ్యాధి స్క్రీనింగ్, కౌమారదశలో ఉన్న బాలికలు, మహిళలకు రక్తహీనత స్క్రీనింగ్, కౌన్సెలింగ్ సేవలు, పిల్లలకు రోగనిరోధక సేవలు అందించబడతాయన్నారు.ఈఅవకాశాన్నిప్రజలంతాసద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, డిఆర్‌డిఏ పిడి ఎంఎస్-ఎస్ వేణుగోపాల్,జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, ఐసిడిఎస్ పిడి డి.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు పొగాకు రైతుల సన్మానం





**ఏలూరు,మేజర్ న్యూస్** : అదనపు పొగాకు కొనుగోళ్లకు కేంద్రం నుంచి అనుమతులు సాధించిన ఎంపీకి రైతుల అభినందనల వెల్లువెత్తాయి. శనివారం ఉదయం స్థానిక శాంతి నగర్ లోని ఎంపీ క్యాంపు కార్యాలయంకు వందలాదిగా తరలివచ్చిన పొగాకు, పామాయిల్ రైతులు ఎంపీని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో పొగాకు, పామాయిల్ రైతుల సమస్యలను పరిష్కరించేందు కు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. రైతుల ఇబ్బందులపై పలుమార్లు తాను పార్లమెంట్ లో మాట్లాడటంతోపాటు, కేంద్ర వాణిజ్య, వ్యవసాయ మంత్రులను కలిసి సమస్యలను వివరించిన మీదట,స్వల్ప పెనాల్టీతో కేంద్రం అనుమతించిన దాని కంటే రైతులు అదనంగా పండించిన పొగాకును కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకరించిందన్నారు. ఆయిల్ పామ్ కు కూడా సరైన ధర లభించేట్లు ఒత్తిడి తేగలిగామని, తాజాగా పామాయిల్ గెలలకు మంచి ధర లభిస్తోందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన పొగాకు, పామాయిల్ రైతు సంఘాల ప్రతినిధులు.. తమ సమస్యలను చెప్పగానే, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు రుణపడి ఉంటామన్నారు. ఇటువంటి ఎంపీ దొరకడం ఏలూరు పార్లమెంట్ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

**- గ్రీవెన్స్‌లో పలు సమస్యలు -**

ఎంపీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. రైతులు, ప్రజలు భారీగా తరలి రావడంతోఎంపీ కార్యాలయం కిక్కిరిసిపోయింది.నియోజకవర్గాల్లో సమస్యలపై పలువురు వినతి పత్రాలు ఇచ్చారు. వినతులు పరిశీలించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేసారు.డిసెంబర్ నాటికి జంగారెడ్డి గూడెం రహదారి పనులు జంగారెడ్డిగూడెం ఏలూరు రహదారి పనులు నిలిచిపోవడంపై కాంట్రాక్టరుని, ఆర్ అండ్ బీ అధికారులను పిలిచి మాట్లాడారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ఈ డిసెంబర్ నాటికి పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని ఎంపీ ఆదేశించారు.ఏలూరు జిల్లా మీదుగా నూతన జాతీయ రహదారి.. ఖమ్మం - కొవ్వూరు జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం నుంచి ద్వారకాతిరుమల - ఏలూరు - కైకలూరు - కత్తిపూడి మీదుగా నూతన జాతీయ రహదారిని ప్రతిపాదిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త రహదారి కోసం త్వరలో ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి పంపుతామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు.

# ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుక





**పాలకొల్లు, మేజర్ న్యూస్** : స్థానిక బి ఆర్ ఆర్ జీకేర్ చాంబర్స్ డిగ్రీ , పీజీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు ద్వితీయ తృతీయ సంవత్సరపు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎస్ కే సులేమాన్ అకాడమిక్ కన్సల్టెంట్ , ఏపీ ఉన్నత విద్యా మండలి ,కాస్మోపాలిటన్ కల్చరల్ , స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెక్రటరీ వేగి వెంకట సోమరాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా సులేమాన్ మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమని నేడు యువతలో క్రియేటివ్ థింకింగ్, లాజికల్ అప్రోచ్ ,డెసిషన్ మేకింగ్, డీప్ సీకింగ్, అర్థమెటిక్ , ఇంగ్లీష్ ,రీజనింగ్ స్కిల్స్ లాంటి నైపుణ్యాలు మంచి ఉద్యోగ అవకాశాలను తెచ్చి పెడతాయని అన్నారు. కళాశాలలో చైర్మన్ కె.వినరసింహారావు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నేటి యువత మీద ఉన్నదని వినయం విధేయతా మంచి సాంప్రదాయాలు మొదటి సంవత్సరం విద్యార్థులకు అవసనం అన్నారు.మరో ముఖ్య అతిథి కాస్మో కల్చరల్ ,స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెక్రటరీ వేగి వెంకట సోమరాజు మాట్లాడుతూ ఛాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ,మధ్య ,దిగువ మధ్య తరగతి కుటుంబ విద్యార్థులకు అందుబాటులో మంచి నాణ్యత ప్రమాణాలతో విద్య ను అందించడమే కాకుండా వారికి ఉద్యోగ కల్పనలో అమితమైన కృషి చేస్తుంది అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ది రిశాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ద్వారా విధ్యార్థులు నాయకత్వ లక్షణాలు , స్నేహ భావం ప్రాబ్లం సాల్వింగ్ విధానాలు అలువడుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కె.వి సీతారామరాజు,కళాశాల ఎడిషనల్ చైర్మన్ తటవర్తి కృష్ణమూర్తి, అకాడమిక్ డైరెక్టర్ ఏబిఎస్ మూర్తి,నందుల సీతారామరావు,ట్రెజరర్ ప్రవీణ్ భాను , కటారీ నాగేంద్ర కుమార్, దేవరపు లక్ష్మీనారాయణకళాశాల డోనర్స్ వేగేసిన రంగరాజు , విశ్వనాథరాజు ,జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ కే .ఎన్ .వి నరసింహారావు , అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు,

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు నూతన బొలేరా వాహనం

**- గుప్తా ఫౌడేషన్ సహకారంతో**

**జిల్లా ఎస్పికి అందజేసిన ఎమ్మెల్యే బడేటి**



**ఏలూరు,మేజర్ న్యూస్** : నూతన బొలారా వాహనం ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు ఎమ్మెల్యే బడేటి చంటి గుప్తా ఫౌండేషన్ యాజమాన్యం తరపున జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ కి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద అంద చేశారు.శనివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు నూతన బొలారా వాహనాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి సహకారంతో గుప్తా ఫౌండేషన్ యాజమాన్యం వారు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్‌కి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ పోలీస్ శాంతి భద్రతను నిర్ధారించేందుకు పోలీసులు అహర్నిశలు సేవలు అందిస్తూ, ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా పని చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశ్యాన్ని అవలంబిస్తూ ప్రజల సహకారంతో పోలీసు వ్యవస్థకు అవసరమైన వాహన, సదుపాయాలను అందజేయడం అత్యంత అవసరం అని తెలిపారు. గుప్తా ఫౌండేషన్ ఈ బాధ్యతను స్వీకరించి నూతన వాహనాన్ని కొనుగోలు చేసి ఎస్పీకి అందజేయడం స్ఫూర్తిదాయకమని అన్నారు. జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ ఈ నూతన బొలారా వాహనం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ మరింత సమర్థవంతంగా ఉద్యోగ నిర్వహణ నిర్వహిస్తామని వివరించారు. ఎమ్మెల్యే సహాయ సహకారాలతో రోడ్డు అక్రమణాలను తొలగించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సహాయంతో సీసీటీవీ లను నగర వ్యాప్తంగా ఏర్పాటు చేయడం ద్వారా ఏలూరు పట్టణాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో ముందంజలో నిలబెట్టాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్ సూర్య చంద్రరావు,డిఎస్పి డి శ్రావణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు,ఎస్‌బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు,తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెలలోనే నరసాపురానికి తొలి వందే భారత్

– పెండింగ్ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయడమే నా ధ్యేయం
– దిగమర్రు – ఆకివీడు వయా భీమవరం బైపాస్
రూ.3200 కోట్లతో డిపిఆర్ సిద్ధం




**భీమవరం,మేజర్ న్యూస్ :** నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ఈ నెలలోనే అందుబాటులోకి రానున్నాయని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు వర్మ ప్రకటించారు. భీమవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలో చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయడం, కొత్త రైళ్లను తీసుకురావడానికి తాను అధిక ప్రాధాన్యత ఇస్తున్నానని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఈ ప్రాజెక్టుల కోసం నిధులు మంజూరు చేయించడంలో కీలక ప్రగతి సాధించానని ఆయన అన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ఉన్న మూడు వందే భారత్ రైళ్లకు అదనంగా, నర్సాపురం–చెన్నై వందే భారత్ రైలు త్వరలో ప్రారంభం కానుందని శ్రీనివాస వర్మ తెలిపారు. గత పది నెలలుగా నిరంతర సమీక్షల తర్వాత రైల్వే శాఖ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం చెన్నై–విజయవాడ మధ్య నడుస్తున్న వందే భారత్ రైలును నర్సాపురం వరకు పొడిగించనున్నట్లు ఆయన చెప్పారు.ఈ రైలు విజయవాడ, భీమవరం, గుడివాడ, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో మాత్రమే ఆగి, ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుందన్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపినందున, త్వరలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు రైలు ప్రారంభ తేదీని ప్రకటిస్తారని తెలిపారు. ఈ రైలు సాధించటం పశ్చిమ గోదావరి ప్రజలకు గర్వకారణమని, దేశంలోనే అత్యంత వేగవంతమైన రైలులో ప్రయాణించే అవకాశం జిల్లా వాసులు లభించిందని అన్నారు. విశాఖపట్నం– హైదరాబాద్ వందే భారత్ కు తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ లో హాల్ట్ కల్పించేందుకు తాను చేసిన విజ్ఞప్తికి అధికారులు అంగీకారం తెలిపారని అన్నారు.

**– రైల్వే స్టేషన్ల ఆధునీకీకరణ –**

అమృత్ భారత్ పథకం కింద నరసాపురం పార్లమెంట్ పరిధిలోని నరసాపురం,భీమవరం, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు వందల కోట్ల రూపాయలతో జరుగుతున్నాయని శ్రీనివాస వర్మ తెలిపారు. ఇటీవల తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ ఆధునికరణకు అదనంగా రూ. 18 కోట్లు, గూడ్స్ గోడౌన్ రోడ్డు మార్గానికి రూ. 8 కోట్లు మంజూరు చేయించడం జరిగిందని శ్రీనివాస వర్మ చెప్పారు.గత 15 సంవత్సరాలుగా కోర్టు కేసులు, రైతులు సహకరించకపోవడం వల్ల పెండింగ్లో ఉన్న దిగమర్రు– ఆకివీడు జాతీయ రహదారి 165 రెండో ప్యాకేజీ పనులు ప్రారంభించేలా కేంద్రమంత్రి అయిన వెంటనే చర్యలు తీసుకున్నానని, గతంలో 800 కోట్లతో రెండు లైన్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు ఎలైన్మెంట్ మార్చి జాతీయ రహదారుల అధికారులతో సర్వే చేయించి కొత్త ఎలైన్మెంట్ తో 2400 కోట్ల రూపాయలు అంచనా తో నాలుగు లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రి అనుమతి సాధించామని అయితే ఎస్ ఎస్ ఆర్ రేట్లు రాష్ట్ర ప్రభుత్వం పెంచడం వల్ల అంచనాలు 3200 కోట్ల రూపాయలు అయిందన్నారు. అయినప్పటికీ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ 3200 కోట్ల రూపాయలతో ఎన్.హెచ్ 165 నిర్మాణానికి అంగీకారం తెలిపారని వివరించారు.

# ఢిల్లీ సదస్సుకు పెనుగొండ సర్పంచ్ శ్యామలాసోని ఎంపిక



**పెనుగొండ, మేజర్ న్యూస్:** పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పెనుగొండ మండల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ నక్కా శ్యామలాసోని శాస్త్రి కి అరుదైన గౌరవం దక్కింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించబోయే సర్పంచ్ సంవాద్ కాన్క్లేవ్ – 2025కు ఆమెకు ఆహ్వానం అందింది. సెప్టెంబర్ 15న న్యూ ఢిల్లీలో భారత్ నాణ్యతా మండలి ఆధ్వర్యంలో, జలశక్తి మంత్రిత్వ శాఖ సహకారంతో ఈ సదస్సు జరగనుంది. దేశవ్యాప్తంగా 75 మంది సర్పంచులను మాత్రమే ఎంపిక చేయగా, వారిలో నక్కా శ్యామలాసోని శాస్త్రి 11వ స్థానంలో గుర్తింపు పొందడం విశేషం. ఈ కాన్క్లేవ్‌లో త్రాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం, గ్రామీణా భివృద్ధి, కేంద్ర నిధుల సమర్థ వినియోగం వంటి అంశాలపై ఎంపికైన సర్పంచులు తమ అనుభవాలు, అభిప్రాయాలు పంచుకోనున్నారు. గ్రామస్థులతో మమేకమై నిరంతరం కృషి చేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించిందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యానారాయణ ఆశీస్సులు, మార్గదర్శకత్వం ఈ విజయానికి ప్రేరణ అని అభిప్రాయపడ్డారు.పశ్చిమగో దావరి జిల్లా నుండి ఎంపిక కావడంగర్వకారణమని పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచులు అభినందనలు తెలిపారు.

# క్రియాశీల జనసైనికుడికి జనసేన అండ

– రూ.5లక్షల చెక్కును అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** టిడ్కో గృహ సముదాయాల్లో నివసిస్తున్న క్రియాశీల జన సైనికునికి జనసేనపార్టీ అండగా నిలిచింది. తాడేపల్లిగూడెంకి చెందిన కూరగాయల వ్యాపారి తిరుపతి వెంకట రమణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆ కుటుంబానికి జనసేన క్రియాశీల సభ్యులకు అందించే క్రియాశీల సభ్యత్వం ద్వారా వచ్చే బీమా 5 లక్షలు అందించారు. మార్కెట్లో కూరగాయల వ్యాపారి వెంకటరమణ సతీమణి సూర్య కుమారి, కుమారుడు భాస్కర్ ఉన్నారు. వెంకట రమణ లారీ యాక్సిడెంట్ తో అకాల మరణం చెందడంతో ఆ కుటుంబానికి తీరని లోటు కలిగింది.ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకి 5లక్షల రూపాయలు బీమా చెక్కును అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కుటుంబానికి పెద్ద దిక్కు అయినా తిరుపతి వెంకటరావు కుటుంబానికి ఏ అవసరం వచ్చినా జనసేన పార్టీ మీకు అండగా ఉంటుందని ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను ఇచ్చే విషయంలో నేను చొరవ తీసుకుని మీ కుటుంబాన్ని ఆదుకునే ప్రయత్నం చేస్తానని అన్నారు.

# చిన్న వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు



**ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయానికి హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాల కృష్ణారావు కుటుంబ సభ్యులతో శనివారం ఉదయం విచ్చేశారు.వారికిఆలయ అధికారులు, పండితులు తూర్పు వైపు గాలిగోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుగా ప్రదక్షిణల అనంతరం బంగారు వాకిటిన ప్రవేశించి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో వేదపండితులు వేదఆశీర్వచనాలు పలుకి స్వామివారి ప్రసాదాలను శేష వస్త్రాన్ని సమర్పించారు. అనంతరం ఆలయ ఈవో ఎన్‌వి సత్యనారాయణమూర్తి స్వామివారి జ్ఞాపికను అందించారు.ఈక్రమంలోఏఈఓనటరాజారావు, సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం ఆలయ సిబ్బంది ఉన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్లు సమస్య కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలి

– ఎంపీ పుట్టా మహేష్‌కు భూ నిర్వాసిత రైతుల వినతి



**ఏలూరు,మేజర్ న్యూస్:** గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు నిర్మాణం చేయాలని, ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. శనివారం ఎంపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి ఎం.పీకి సమస్యలు విన్నవించారు. సర్వేస్ రోడ్లు నిర్మాణం జరగకపోవడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు, దేవరపల్లి సత్యనారాయణ, వందనపు సాయిబాబా, గోలి నర్సిరెడ్డి మాట్లాడారు. ఖమ్మం నుండి దేవరపల్లి వరకు నిర్మాణం చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే మన జిల్లాలో చింతలపూడి, టీ నర్సాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల గుండా నిర్మాణం జరుగుతున్నదని,ఈ మండలాల్లో దాదాపు 31 గ్రామాలు మీదుగా హైవే వెళుతున్నదన్నారు.ఈ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ లేదని, అయితే రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద చెట్లు పెంచుతారని, వాటి బాగోగులకు అటు ఇటు మట్టి రోడ్లు ఉంటుందని, దాన్ని గ్రావెల్ రోడ్డుగా మార్చి రైతులకు ఉపయోగకరంగా తీసుకువస్తామని గతంలో హామీ ఇచ్చారని చెప్పారు. అయితే ప్రస్తుతం మట్టి రోడ్డు కూడా రైతులకు అందుబాటులో లేదన్నారు.. సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించకపోవడంతో చాలాచోట్ల రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

– సానుకూలంగా స్పందించిన ఎంపీ –సానుకూలంగా స్పందించిన ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ గ్రీన్ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్ల సమస్యపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

# పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

– ఎమ్మెల్యే బొలిశెట్టికి 2003 డీఎస్సీ సంఘ నాయకుల వినతి



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** 2003 డీఎస్సీ నియామక ఉపాధ్యాయులకు పాత పెన్షన్లు పునరుద్ధరించాలని కోరుతూ నియోజకవర్గంలోని 2003 డీఎస్సీ సంఘ నాయకులు శనివారం ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ ఉత్తర్వులు రాకముందే 2003 డిఎస్సి నోటిఫికేషన్ జరిగిందని వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం మెమో 57ను అమలు చేస్తూ తమకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ని కలిసిన వారిలో డీఎస్సీ 2003 కన్వీనర్ ఎల్ మహేష్,కే శివ గణేష్,అజయ్, పెద్దిరాజు తదితరులు ఉన్నారు.